RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 434 | 28 మంగళవారం జూలై 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--



## సింగరేణిని కేసీఆర్ దారుణంగా మోసం చేశారు

**: కిషన్ రెడ్డి**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సింగరేణి సంస్థను తీవ్రంగా మోసం చేశారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సింగరేణి దక్షిణాదిలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి సంస్థ అని, తెలంగాణతో పాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలతో పాటు ఎన్టీపీసీకి ఇది బొగ్గును సరఫరా చేస్తోందని గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తన స్వార్థ రాజకీయాల కోసం సింగరేణిని వాడుకుని, దానికి తీవ్ర ఆర్థిక నష్టాన్ని చేకూర్చిందని కిషన్ రెడ్డి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి ఈ సంస్థలో 49 శాతం వాటా, తెలంగాణ ప్రభుత్వానికి 51 శాతం వాటా ఉందన్న ఆయన... కేసీఆర్ పాలనలో సింగరేణిని ఒక రాజకీయ వేదికగా మార్చేసి, దాని ఆదాయానికి కోలుకోలేని గండి కొట్టారని విమర్శించారు. కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధిని పక్కనబెట్టి రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చారని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ సింగరేణి పరిస్థితిలో పెద్దగా మార్పు ఏమీ రాలేదని ఆయన వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి, సింగరేణి పునరుద్ధరణకు, కార్మికుల సంక్షేమానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కిషన్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

### 150 ఏళ్లలో ఎన్నడూ లేని

## కరవు నెలకొంది

**: తుమ్మల నాగేశ్వరరావు**



ప్రపంచంపై ప్రకృతి తీవ్రంగా దాడి చేస్తోందని తెలంగాణ వ్యవసాయం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. గత 150 సంవత్సరాలలో ఎన్నడూ చూడని తీవ్ర కరవు పరిస్థితులు కనిపిస్తున్నాయని తెలిపారు. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరగడం వల్ల దేశానికి రావాల్సిన నైరుతి రుతుపవనాల జాడ లేకుండా పోయిందని, దాంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. దీని ప్రభావం వచ్చే మార్చి, ఏప్రిల్ నెలల వరకు ఉండే అవకాశం ఉందని, రాబోయే రోజుల్లో సరైన వర్షాలు కురవవని ఐఎండీ మరియు అంతర్జాతీయ వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారని పేర్కొన్నారు.

వచ్చే నెలలో కురిసే స్వల్ప వర్షాలు కేవలం మెట్ట పంటలకు మాత్రమే ఉపయోగపడతాయని, ప్రస్తుత పరిస్థితుల్లో వరి సాగు చేయడం చాలా కష్టతరమని స్పష్టం చేశారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రైతులు తక్కువ సమయంలో, తక్కువ నీటితో పండే పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా, రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా తీర్చిదిద్ది రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. మార్కెట్ కమిటీల పనితీరును పరిశీలించేందుకు 6 ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశామని, ఇవి వారం రోజుల పాటు తనిఖీలు నిర్వహిస్తాయని తెలిపారు.

### హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలని

# హైకోర్టు సంచలన ఆదేశాలు




తెలంగాణ హైకోరు(High Court) సంచలన ఆదేశాలు జారీ చేసింది. వరుస వివాదాల నేపథ్యం లో హైకోర్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను(ఝఅస్త్రుఅఫ్ష్ట) తొలగించాలని చీఫ్ సెక్రటరీని ఆదేశించిం ది. అర్హత కలిగిన మరో అధికారిని నియామించాలని ఆదేశించింది. 63 కోర్టు ధిక్కరణలపై ఉన్నత న్యాయ స్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇన్ని ఉల్లంఘలనకు పాల్పడుతున్న అధికారిని ఇంకా కొనసాగిస్తే రూల్ ఆఫ్ లా అదుపు తప్పుతుందని,రంగనాథ్ స్థానంలో ఐజీ స్థాయి అధికారిని నియమించాలని తెలిపింది.కాగా, గతంలోను హైకోర్టు రంగనాథ్‌ను పద్ధతి మార్చుకోవాలని పలు మార్లు హెచ్చరించింది. కాగా, ప్రైవేట్ ఆస్తి వివాదంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహారశైలిపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఒకే అంశానికి సంబంధించి ఏకంగా మూడు కోర్టు ధికరణ పిటిషన్లు దాఖలవడం అత్యంత తీవ్రమైన విషయమని వ్యాఖ్యానించింది. కోర్టు ఉత్తర్వులను పదేపదే ఉల్లంఘించడం వెనుక కారణమేమిటని నిలదీసింది. ప్రైవేటు ఆస్తిలో జోక్యం చేసుకోవద్దని స్పష్టమైన ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ వాటిని లెకచేయకుండా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించింది. కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన అలవాటుగా మారిందా? కోర్టు ధికరణనే పరిపాటిగా మార్చుకున్నారా? అంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది.ఒకటి కాదు, రెండు కాదు, ఒకే అంశంపై మూడు కోర్టు ధికరణ పిటిషన్లు దాఖలవుతున్నాయంటే కోర్టు ఉత్తర్వుల పట్ల ఎంత నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారో స్పష్టమవుతున్నదని ఘాటుగా వ్యాఖ్యానించింది. కోర్టుల పట్ల ఎంత గౌరవం ఉన్నదో ఈ పరిణామాలే చెప్తున్నాయని పేరొంది. ఇకడ బాధితుడు పిటిషనర్ కాదని, స్వయంగా కోర్టేనని ధర్మాసనం స్పష్టం చేసింది.ఖీశీశీకోర్టు ఉత్తర్వులను ధికరించడం ఎంతమాత్రం సహించబోమని రంగనాథ్‌కు తేల్చిచెప్పింది. ప్రభుత్వమైనా, ప్రభుత్వాధికారులైనా చట్టానికి అతీతులు కాదని స్పష్టం చేసింది. నీటి వనరులు, నాలాలు, కాలువల పరిరక్షణ పేరుతో కోర్టు ఉత్తర్వులను పకనపెట్టి ప్రైవేటు భూముల్లోకి వెళ్లడం ఏ చట్టం ప్రకారం సమర్థనీ యమని ప్రశ్నించింది. యజమాని అనుమతి లేకుండా ప్రైవేటు భూమిలో అడుగు పెట్టరాదన్న ప్రాథమిక సూత్రం తెలియదా అని నిలదీసింది. ప్రభుత్వ భూమిని రక్షించడమే లక్ష్యమైతే ప్రైవేటు వ్యక్తిపై పోలీసు ఫిర్యాదు ఎందుకు చేశారని ప్రశ్నించింది.

# రుణమాఫీ నిధులు జమ చేయండి

**- వడ్డీ కూడా తిరిగి చెల్లించండి**

**- వ్యవసాయ శాఖకు హైకోర్టు ఆదేశం**




రుణమాఫీ పథకానికి అర్హులైన రైతులకు సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన రుణమాఫీ మొత్తాన్ని జమ చేయడంతోపాటు వారు చెల్లించిన వడ్డీ మొత్తాన్ని తిరిగి చెల్లించాలన్న వినతిని పరిశీలించి రెండు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు నల్లగొండ జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ సూరేపల్లి నందా ఉత్తర్వులు జారీ చేశారు. నల్లగొండ జిల్లా సూరారం గ్రామానికి చెందిన కరుణాకర్‌రెడ్డి, మల్లారెడ్డి అద్దూదొల్లు అనే ఇద్దరు రైతులు ఈ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. వీరు తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుంచి సాగు కోసం ఒకొకరు రూ.1.6 లక్షల పంట రుణం తీసుకున్నారు. అనంతరం ప్రభుత్వం 2024 డిసెంబర్ 9న రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ పథకాన్ని ప్రకటించగా, వీరి పేర్లు అర్హుల జాబితాలో కూడా చోటు దకించుకున్నాయి. అయితే, తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఐఎఫ్ఎస్సీ కోడ్ మారిపోవడంతో ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ నిధులు రైతుల ఖాతాల్లో జమ కాకుండా తిరిగి ప్రభుత్వ ఖాతాకు వెళ్లిపోయాయని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

## ఐఐటీ విద్యార్థికి రామన్న గిఫ్ట్




బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తన ఔదార్యం చాటుకున్నారు. గిఫ్ట్ ఏ స్మైల్ ద్వారా విద్యార్థులకు తన వంతు సహాయ, సహకారాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఐఐటీ వారణాసిలో సీటు సాధించిన సిరిసిల్ల విద్యార్థి గడదాస్ అభినవ్ తన తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ-శ్రీలతతో సోమవారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా అభినవ్‌ను కేటీఆర్ శాలువాతో ఘనంగా సతరించి ల్యాప్‌టాప్‌ను గిఫ్ట్ స్మైల్ కింద అందజేశారు. కళాశాల ఫీజు కూడా తానే చెల్లిస్తానని హామీ ఇచ్చారు. చకగా చదువుకొని తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని, ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. తమ కుమారుడి విద్యాభివృద్ధికి అండగా నిలిచిన కేటీఆర్‌కు అభినవ్ తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎన్టీఆర్ భుజానికి గాయం..!



టాలీవుడ్‌లో స్టార్ హీరోలు వరసగా గాయాలబారిన పడుతున్నారు. తాజాగా జూనియర్ ఎన్టీఆర్ (NTR) గాయపడ్డారు. సోమవారం సాయంత్రం అనుకోకుండా ఆయన భుజానికి గాయమైంది. దాంతో.. వెంటనే కుటుంబసభ్యులు ఆయనను ఆస్పత్రికి వెళ్లారు. ఎన్టీఆర్‌ను పరీక్షించిన వైద్యులు పూర్తిగా కోలుకునేంత వరకూ విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. కనీసం ఆరు నుంచి ఎనిమిది వారాలు రెస్ట్ తప్పనిసరి అని డాక్టర్లు చెప్పారు.ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న 'డ్రాగన్' (చీ= 31) సినిమాతో బిజీగా ఉన్న జూనియర్ ఎన్టీఆర్ అనకోకుండా గాయపడ్డారు. సోమవారం సాయంత్రం ఆయన భుజానికి గాయం కావడంతో ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ డాక్టర్ జె. మధుసూదన్ రావు, డాక్టర్ ఆర్.ఏ. పూర్ణచంద్ర తేజస్వీలు ఎన్టీఆర్‌ను పరీక్షించి.. చికిత్స అందించారు. పూర్తిగా కోలుకునేందుకు కనీసం ఆరు నుంచి ఎనిమిది వారాలు పడుతుందని చెప్పారు. కాబట్టి.. విశ్రాంతి తీసుకోవాలని ఎన్టీఆర్‌కు వైద్యులు సూచించారు.ఈ విషయాన్ని సోషల్ మీడియా పోస్ట్ ద్వారా అభిమానులతో పంచుకుంది ఎన్టీఆర్ కార్యాలయం. ఎవరూ అందోళన చెందవద్దని కోరింది. హీరో ఆరోగ్యం గురించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీతో పంచుకుంటామని పేర్కొంది. పరిస్థితిని అర్థం చేసకుని.. మద్దతుగా నిలిచినందుకు ఫ్యాన్స్‌కు ధన్యవాదాలు తెలిపింది ఎన్టీఆర్ కార్యాలయం.

## హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డికి చెంపదెబ్బ

**: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**




వరుస వివాదాల నేపథ్యంలో హైకోర్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను(ఝఅస్త్రుఅఫ్ష్ట) తొలగించాలని చీఫ్ సెక్రటరీకి ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. రంగనాథ్ మీదున్న 63 కోర్టు ధిక్కరణలపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఉన్నత న్యాయ స్థానం ఇన్ని ఉల్లంఘలనకు పాల్పడుతున్న అధికారిని ఇంకా కొనసాగిస్తే రూల్ ఆఫ్ లా అదుపు తప్పుతుందని, రంగనాథ్ స్థానంలో ఐజీ స్థాయి అధికారిని నియమించాలని తెలిపింది.ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డికి చెంపదెబ్బలాంటిదన్నారు. రేవంత్ రెడ్డికి ఏ మాత్రం కూడా తెలంగాణను పరిపాలించే నైతిక అర్హత లేదని ఇవాళ హైకోర్టు ఇచ్చిన తీర్పు ద్వారా తేలిపోయింది. లక్షమంది పోలీసులున్న ఈ రాష్ట్రంలో హోంమంత్రి అయిన గౌరవ హైకోర్టు స్థానిక పోలీసులెవరూ కూడా తెలంగాణ ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడలేరు. అందుకు ఆర్మీ అధికారులను ఆదేశించింది.. అంటే అసలు మీకు ఇక నైతిక హక్కు ఎక్కుడుందని ప్రశ్నించారు.ఈ రాష్ట్ర ప్రభుత్వం కూల్చివేతల ప్రభుత్వం. విధ్వంసకర ప్రభుత్వం. లగచర్లలో, వెలుగుమట్లలో నాశనం చేశారు. సున్నం చెరువు పేరుతో, బహదూర్ గూడ పేరుతో, లోతుకుంటలో ఎక్కడ చూసినా విధ్వంసమే. ఆ విధ్వంసం చేస్తూనే మరోవైపు పేదల భూములను మీ సొంత సోదరులు, మీ కాంగ్రెస్ పార్టీ నాయకులంతా కబ్జాలు చేస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు.హైడ్రాను అడ్డం పెట్టుకుని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూభారతి పోర్టల్‌ను తీసుకొని దొడ్డి దారిన దాదాపు 22 వేల ఎకరాల భూముల హక్కులను రాత్రికి రాత్రే ఎమ్మార్వో, ఆర్డీవోల సంతకాలు లేకుండా బదలాయించారు. అందుకే నేను గతంలో తెలంగాణ ప్రభుత్వంలో పనిచేసిన మీ అధికారిగా, సోదరుడిగా, ప్రభుత్వ అధికారులకు చెబుతున్నా దయచేసి రాజ్యాంగాన్ని పాటించండి. చట్టాన్ని పాటించండి.. కోర్టులు ఇచ్చిన ఆదేశాలను దయచేసి అతిక్రమించకండని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కోరారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
28 మంగళవారం జూలై 2026

# మందమర్రి కేకే ఓసిపి, బొగ్గు గనులను సందర్శించిన డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ & ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు







హైదరాబాద్ ఎస్టేట్ 27జులై 2026
సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (రాజజూ) డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ & ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు సోమవారం మంచిర్యాల జిల్లా మందమరి ఏరియాలో విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఏరియాలోని పలు ప్రాజెక్టులు, ఉపరితల (ఓసీపీ ) మరియు భూగర్భ (ఖ+) బొగ్గు గనులను పరిశీలించి, బొగ్గు ఉత్పత్తి, నాణ్యత, రవాణా మరియు రక్షణ చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముందుగా రామకృష్ణపూర్ లోని ఓసీపీ ఫేస్–2 ను సందర్శించారు. అలాగే గని పరిసర ప్రాంతాల్లో చేపడుతున్న అటవీ పునరుద్ధరణ, ఫారెస్ట్ క్లియరెన్స్ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మందమర్రి ఏరియాలోని ప్రముఖ కేకే ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ (కేకే ఓసీపీ )ను సందర్శించిన ఆయన, అక్కడి బొగ్గు ఉత్పత్తి మరియు ఉత్పాదకత (ప్రొడక్టివిటీ ) గణాంకాలను అడిగి తెలుసుకున్నారు. త్రైమాసిక లక్ష్యాలను చేరుకోవడానికి ఉత్పత్తి వేగాన్ని పెంచాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. తరువాత మందమరి ఏరియాలోని శాంతిఖని గనితో పాటు కాసిపేట–1, కాసిపేట–2 భూగర్భ గనుల మైనింగ్ ప్లాన్లను, అధికారులతో కలిసి సమీక్షించారు. గనుల్లో రక్షణ చర్యలకు ప్రాధాన్యతనిస్తూనే ఉత్పత్తి పెంచేలా ప్రణాళికలు అమలు చేయాలని స్పష్టం చేశారు. భూగర్భ గనులలో రక్షణ కోసం ఉపయోగించే స్టోవింగ్ బంకర్ల పనితీరును, వాటి నిర్వహణను ఆరా తీశారు. అనంతరం కేకే ఓసిపి రైల్వే సైడింగ్‌ను సందర్శించి, వినియోగదారులకు బొగ్గు రవాణా పనులు వేగవంతంగా జరిగేలా రైల్వే సైడింగ్ పనుల పురోగతిని తనిఖీ చేశారు. మందమరి ఏరియా మైన్స్ వొకేషనల్ ట్రైనింగ్ సెంటర్ (ఎంవీటీసీ ) పనితీరుపై, అధికారుల మరియు సూపర్‌వైజర్ల పోస్టింగ్‌లకు సంబంధించిన అంశాలపై ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఉద్యోగులకు క్రమం తప్పకుండా నైపుణ్యాభివృద్ధి మరియు రక్షణ శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో మందమరి ఏరియా జనరల్ మేనేజర్ (జీఎం ), ఎన్ రాధాకృష్ణ , ఎస్ ఓ టు జి ఎం, జి. ఎల్. ప్రసాద్ , ఏజీఎం (ఈ అండ్ ఎం) బాలాజీ భగవతి జ, డీజీఎం సర్వే బుఖ్య దేశాయ్, డి జి ఎం సివిల్ మదీనా భాష, కేకే ఓ సి మేనేజర్ కె. రామరాజు, క్వాలిటీ అధికారి, ప్రదీప్ , కేకే ఓ సి (పి ఈ) వెంకట వంశీధర్, ఎస్ ఎస్ ఓ, (రా&రాజ) వెంకటేశ్వర్ రెడ్డి మరియుతదితరులు అధికారులు పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ డైరెక్టర్ బద్రి ప్రకాష్‌కు ఘన సన్మానం



హైదరాబాద్ ఎస్టేట్ 26 జులై 2026
మంచిర్యాల జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రామగిరి బానేష్, వైస్ చైర్మన్‌గా జాలే రాయలింగు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా స్థానిక పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బద్రి ప్రకాష్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం, మంచిర్యాల మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్యమహేష్, మంచిర్యాల కార్పోరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పోరేటర్ తూముల నరేష్, జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ సంగతి మురళి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి,టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సమష్టి కృషితో పరకాలకు రాష్ట్రంలో నాలుగో స్థానం
## సహకరించిన అధికార యంత్రాంగం, నాయకులు, కార్యకర్తలకు దాడి శివ కృతజ్ఞతలు



గీసుగొండ, జులై 27 హైదరాబాద్ ఎస్టేట్:
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో సమష్టి కృషి ఫలితంగానే పరకాల నియోజకవర్గం రాష్ట్రవ్యాప్తంగా నాలుగో స్థానం సాధించిందని గీసుగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాడి శివ పేర్కొన్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదేశాల మేరకు గత నెల రోజులుగా గీసుగొండ మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పనులను వంద శాతం పూర్తిచేసేందుకు అధికార యంత్రాంగం, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేశారని తెలిపారు. ఈ సమిష్టి కృషి ఫలితంగానే పరకాల నియోజకవర్గం రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచిందన్నారు. ఈ విజయానికి సహకరించిన మండల తహసీల్దార్, పర్యవేక్షకులు, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ దాడి శివ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న కార్యక్రమాల్లోనూ ఇదే సమన్వయం, అంకితభావం, కార్యదీక్షతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజాసేవలో ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు.

# మరియాపురంలో ఘనంగా వనమహోత్సవం
## విద్యార్థులతో మొక్కలు నాటించి పర్యావరణ పరిరక్షణపై అవగాహన






గీసుగొండ జులై 27 హైదరాబాద్ ఎస్టేట్:
పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, మొక్కల పెంపకంతోనే భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తు అందించగలమని వక్తలు పేర్కొన్నారు. మరియాపురం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో, సెయింట్ జాన్స్ పాఠశాల యాజమాన్యం సహకారంతో సోమవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ నినాదాలతో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి, అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో కూడా మొక్కలు నాటారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సౌజన్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పుట్టినరోజుకు ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. గ్రామ సర్పంచ్ అర్పిత దిలీప్ తిరుమలరెడ్డి మాట్లాడుతూ మొక్కలు ప్రాణవాయువును అందిస్తే, విద్యార్థులు సమాజాభివృద్ధికి, దేశ ప్రగతికి బలమైన పునాదిగా నిలుస్తారని అన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి సుధాకర్ చెట్ల పెంపకం వల్ల పర్యావరణ సమతుల్యతతో పాటు వ్యవసాయ రంగానికీ విశేష ప్రయోజనం కలుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బిట్ల శివప్రసాద్, వార్డు సభ్యుడు అడ్డాల దశరథ్ కుమార్, పశువైద్యాధికారి డాక్టర్ కవికుమార్, మహిళా సమాఖ్య సమన్వయకర్త బొజ్జ సురేష్, మాజీ ఎంపీటీసీ మంజుల రాజు, సీనియర్ మేట్ అడ్డాల కళ్యాణి, వనసేవకుడు రంపిస వంశీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పంచర్ షాప్‌లకు రక్షణ కల్పించాలి
## పెట్రోల్ బంకుల్లో ఉచిత గాలి సేవలు నిలిపివేయాలని రాష్ట్ర మహాసభ డిమాండ్



వరంగల్, జూలై 27 హైదరాబాద్ ఎస్టేట్:
పంచర్ షాప్‌లపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వేలాది మంది చిన్న వ్యాపారులు, కార్మికుల జీవనోపాధిని పరిరక్షించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర పంచర్ షాప్ యూనియన్ రాష్ట్ర మహాసభ డిమాండ్ చేసింది. హనుమకొండ బాలసముద్రంలోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర మహాసభలో ఈ మేరకు పలు తీర్మానాలు ఆమోదించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నగేష్ మాట్లాడుతూ, పెట్రోల్ బంకుల్లో ఉచితంగా గాలి నింపే సౌకర్యం వల్ల పంచర్ షాప్‌ల ఆదాయం రోజురోజుకూ తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న పేద, బడుగు వర్గాల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. పంచర్ షాప్‌ల మనుగడను కాపాడేందుకు పెట్రోల్ బంకుల్లో ఉచిత గాలి సేవలను నిలిపివేసి, చిన్న వ్యాపారుల ప్రయోజనాలను రక్షించే విధంగా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా పంచర్ షాప్ యజమానులు, కార్మికులు ఐక్యంగా ముందుకు వచ్చి హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. తమ ఉద్యమానికి వినయ్ అన్న అండగా నిలుస్తున్నారని, ఆయన సహకారంతో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. మహాసభలో రాష్ట్ర, జిల్లా నాయకులు, పంచర్ షాప్ యజమానులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని పలు కీలక తీర్మానాలు ఆమోదించారు.

# జర్నలిస్టుల హక్కుల కోసం ఢిల్లీలో గళమెత్తిన టీడబ్ల్యూజేఎఫ్
## – జంతర్ మంతర్ లో తెలంగాణ జర్నలిస్టుల ధర్నా




న్యూఢిల్లీ:జూలై 27:
దేశవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల పై తెలంగాణ జర్నలిస్టులు ఢిల్లీలో గళమెత్తారు. కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పాత్రికేయులు పార్లమెంటు సమీపంలోని జంతర్ మంతర్ లో పెద్ద ఎత్తున ధర్నా చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఇచ్చిన “ఛలో పార్లమెంట్“ పిలుపునందుకొని రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఢిల్లీ తరలివచ్చిన పాత్రికేయులు ధర్నాలో పాల్గొని సమస్యలపై గొంతెత్తారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాను ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ నాయకులు, ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ అధ్యక్షుడు మారూఫ్ రజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులందరి పక్షాన తెలంగాణ జర్నలిస్టులు ఢిల్లీలో పార్లమెంట్ వద్ద ధర్నా చేయడం అభినందనీయమని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పాత్రికేయుల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ముందుండి పోరాటం చేయడం గొప్ప విషయమని అన్నారు.
ధర్నా కార్యక్రమంలో జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జర్నలిస్టులు కూడా ఈ ధర్నాలో పాల్గొని ఉద్యమానికి మద్దతు ప్రకటించారు.
ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి పాత్రికేయుడి హక్కుల కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ ధర్నాలో ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఉపాధ్యక్షుడు లియాఖత్, సభ్యులు మాన్విక మిశ్రా,రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొట్లపల్లి అశోక్ గౌడ్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు సానేం శ్రీనివాస్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యుడు నంబి పర్వతాలు వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్ ల పునరుద్ధరణ, రిటైర్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం, జర్నలిస్టుల రక్షణ చట్టం, నేషనల్ మీడియా కమిషన్ ఏర్పాటు, జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు పునఃసమీక్ష తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ లకు అందజేశారు...

# గ్రామకంఠం భూముల కోసం దీక్షల జోరు
## మూడో రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 27:–
ఇబ్రహీంపట్నం: మండలంలోని దండు మైలారం గ్రామంలో గ్రామకంఠం భూములను పరిరక్షించాలంటూ గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. సర్పంచ్ నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ నిరసన కార్యక్రమానికి అఖిలపక్ష నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్దఎత్తున సంఘీభావం ప్రకటించారు. స్థానిక కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలతో నిరసనకు మద్దతు తెలుపుతూ ప్రజల్లో అవగాహన కల్పించారు. గ్రామకంఠం భూముల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని దీక్షలో పాల్గొన్న వారు డిమాండ్ చేశారు. గ్రామ హక్కులను కాపాడే వరకు తమ పోరాటం ఆగదని, లక్ష్యం నెరవేరే వరకు రిలే నిరాహార దీక్షలను నిరంతరం కొనసాగిస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ ఆందోళన గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

## గుంతల్లో వరినాటుతో గళమెత్తిన బి జె పి నాయకులు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 27:-
రంగారెడ్డి జిల్లా: రాగన్నగూడ గ్రామంలోని ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని ప్రజలకు నిత్యసమస్యగా మారింది. రోడ్డంతా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడగా, వర్షం కురిసినప్పుడల్లా వాటిలో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాలు జారిపడే ప్రమాదంతో పాటు చిన్నారులు, వృద్ధులు రాకపోకలకు భయపడే పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు 5356 డివిజన్ “జి హెచ్ ఎం సి“ అధ్యక్షుడు ఎలిమినేటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు, గ్రామస్థులు వినూత్నంగా నిరసన చేపట్టారు. రోడ్డుపై నీటితో నిండిన గుంతల్లో వరినాటు వేసి రహదారి దుస్థితిని నిరసించారు.ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ, చిన్న వర్షానికే రహదారి చెరువును తలపిస్తోందని, నిల్వ నీటి కారణంగా దోమలు పెరిగి ప్రజారోగ్యానికి కూడా ముప్పుగా మారుతోందని అన్నారు. ప్రమాదాలకు కారణమవుతున్న ఈ రహదారిని వెంటనే మరమ్మతులు చేయడంతో పాటు నీరు నిల్వకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని “జి హెచ్ ఎం సి“ అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సురేష్ నందగిరి, పన్నాల సురేందర్ రెడ్డి, బాలకృష్ణ గౌడ్, శేఖర్ రెడ్డి, మల్లేష్, నితిన్‌తో పాటు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని రహదారి మరమ్మతులను తక్షణమే చేపట్టాలని కోరారు.ం

# ప్రజావాణిలో 136 వినతులు..

## అధికారులకు కలెక్టర్ కీలక ఆదేశాలు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 27:-
రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 136 ఫిర్యాదులు అందగా, వాటిని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు వెంటనే పంపించారు. ప్రజలు సమర్పించే ప్రతి వినతిని బాధ్యతగా పరిశీలించి, ఆలస్యం చేయకుండా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ప్రజలకు అందుబాటులో ఉన్న ముఖ్యమైన ఫిర్యాదుల పరిష్కార వేదిక అని పేర్కొన్నారు. ప్రజలు నమ్మకంతో అందించే అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా, వాటిపై క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహించి త్వరితగతిన పరిష్కారం చూపాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఎలాంటి దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకుండా, నిర్ణీత గడువులోపు చర్యలు పూర్తి చేయాలని సూచించారు.ప్రజావాణిలో అందిన వినతుల్లో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 54, ఇతర శాఖలకు సంబంధించినవి 82 ఉండగా, మొత్తం 136 దరఖాస్తులు నమోదు అయ్యాయి. భూ వివాదాలు, సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతులు, పౌర సేవలు, వివిధ పరిపాలనా సమస్యలకు సంబంధించిన అంశాలు ప్రధానంగా వినతుల్లో చోటు చేసుకున్నాయి.
ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కిరణ్మయి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొని ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి తదుపరి చర్యలకు సిద్ధం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ మరోసారి సూచించారు.

## విద్యార్థులకు వరంగా మారిన ధ్రువ స్టడీ హాల్



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 27:-
రంగారెడ్డి జిల్లా: తుర్కయంజాల్ చౌరస్తాలో విద్యార్థుల విద్యాభ్యాసానికి తోడ్పడేలా ఏర్పాటు చేసిన ధ్రువ స్టడీ హాల్ డిజిటల్ లైబ్రరీను స్థానిక నాయకులు కొత్తకురుమ మంగమ్మ శివకుమార్, కోశిక ఐలయ్య ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు స్టడీ హాల్‌ను పరిశీలించి అందుబాటులో ఉన్న సౌకర్యాలపై నిర్వాహకులను అభినందించారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో ఏకాగ్రతతో చదువుకునేందుకు ప్రత్యేక అధ్యయన కేంద్రాల అవసరం ఎంతో ఉందన్నారు. ఆ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఆధునిక సౌకర్యాలతో ధ్రువ స్టడీ హాల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. డిజిటల్ లైబ్రరీ, సౌకర్యవంతమైన సీటింగ్, నిరంతర విద్యుత్, ఏసీ, నాన్ ఎసి గదులతో పాటు అందుబాటు ధరలలో వంటి సదుపాయాలతో విద్యార్థులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా గ్రూప్స్, యూపీఎస్సీ, టీఎస్‌పీఎస్సీ, బ్యాంకింగ్, రైల్వే తదితర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో పాటు ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఈ స్టడీ హాల్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. చదువుపై ఆసక్తి ఉన్న ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన అధ్యయన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో ధ్రువ స్టడీ హాల్ ప్రారంభించడం తుర్కయంజాల్ ప్రాంత యువతకు ప్రయోజనకరమైన ముందడుగుగా స్థానికులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, యువకులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# బ్లాక్ స్పాట్లపై చందనా దీప్తి ప్రత్యేక దృష్టి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 27:-
ఇబ్రహీంపట్నం, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (అడ్మిన్ & ట్రాఫిక్) జి. చందనా దీప్తి, ఐపీఎస్ సోమవారం ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డీసీపీ శివమ్ ఉపాధ్యాయ, ఐపీఎస్, మహేశ్వరం ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ ఎ. చంద్రశేఖర్ పాల్గొన్నారు. తనిఖీలో భాగంగా జేసీపీ పోలీసు సిబ్బంది టర్నౌట్, క్రమశిక్షణ, విధి నిర్వహణను పరిశీలించి ఉత్తమంగా పనిచేస్తున్న ముగ్గురు సిబ్బందిని అభినందిస్తూ రివార్డులతో సత్కరించారు. అనంతరం స్టేషన్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆమె, నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై గుర్తించిన బ్లాక్ స్పాట్లు, గత మూడేళ్లలో అక్కడ జరిగిన ప్రాణాంతక రోడ్డు ప్రమాదాల వివరాలను సమీక్షించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్ల వద్ద ఇంజినీరింగ్ మార్పులు, కట్టుదిట్టమైన ట్రాఫిక్ అమలు చర్యలు, ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు సమన్వయంతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారులపై కొనసాగుతున్న, రానున్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ప్రత్యేక రికార్డులు నిర్వహించడంతో పాటు, ట్రాఫిక్‌పై వాటి ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి అవసరమైన డైవర్షన్‌లు, ట్రాఫిక్ నిర్వహణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.
అనంతరం ట్రాఫిక్ సిబ్బందితో సమావేశమైన జేసీపీ వారి సంక్షేమం, విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుని, న్యాయమైన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తర్వాత డీసీపీ, ఏసీపీ తదితర అధికారులతో కలిసి ఇబ్రహీంపట్నంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలోని బ్లాక్ స్పాట్‌ను ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రమాదాలకు దారితీసే కారణాలను గుర్తించి, రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేసే చర్యలను వెంటనే అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ చి. జితేందర్ రెడ్డి, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆగస్టు 3లోగా SIR ఫారం సమర్పించండి..

# ఓటు హక్కును కాపాడుకోండి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 27:-
రంగారెడ్డి జిల్లా: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత విలువైన రాజ్యాంగబద్ధ హక్కు. ఈ హక్కు పరిరక్షణ కోసం భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ూ×=) కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు ఆగస్టు 3 చివరి తేదీగా నిర్ణయించింది. ప్రతి అర్హులైన ఓటరు తమ వివరాలను పూర్తిగా నమోదు చేసి సంబంధిత బూత్ లెవల్ అధికారి (బీఎల్‌వో)కు గడువులోగా ఫారం అందజేయాలని అధికారులు కోరుతున్నారు. ఎన్నికల సంఘం ఓటరు జాబితాను ఖచ్చితంగా రూపొందించేందుకు చిరునామా మార్పులు, కొత్త ఓటర్లు, మరణించిన వారు లేదా ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలను నవీకరిస్తోంది. ఇందులో భాగంగానే ఇంటింటికీ వెళ్లి బీఎల్‌వోలు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్నారు. ఫారాన్ని పూర్తిగా నింపి తిరిగి సమర్పించడం ప్రతి ఓటరి బాధ్యతగా అధికారులు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు ఎన్యూమరేషన్ పురోగతి 60.79 శాతానికి మాత్రమే చేరుకుంది.నియోజకవర్గాల వారీగా ఇబ్రహీంపట్నం 68.87%, ఎల్‌బీనగర్ 50.75%, మహేశ్వరం 53.70%, రాజేంద్రనగర్ 55.40%, శేరిలింగంపల్లి 53.94%, చేవెళ్ల 77.44%, కల్వకుర్తి 85.66%, షాద్‌నగర్ 83.12 శాతం నమోదైంది. ఇంకా వేలాది మంది ఓటర్లు ఫారాలు సమర్పించాల్సి ఉందని అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, ఆగస్టు 3లోగా ఎన్యూమరేషన్ ఫారం సమర్పించని వారి వివరాలు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిశీలనకు గురవుతాయని తెలిపారు. అవసరమైన ప్రక్రియ అనంతరం ఓటరు జాబితాలో పేరు కొనసాగకపోతే ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉండడంతో చివరి రోజు వరకు వేచి ఉండకుండా వెంటనే బీఎల్‌వోను సంప్రదించి ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబం తమ ఇంట్లోని అర్హులందరూ ఫారాలు సమర్పించేలా చూసి, ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని అధికారులు పిలుపునిచ్చారు.

# మాతృ మరణాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 27:-
కొంగరకలాన్: రంగారెడ్డి జిల్లాలో మాతృ మరణాల నివారణకు మరింత సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ డా. కిరణ్ మయి అధికారులను ఆదేశించారు. కొంగరకలాన్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లాలో ఇటీవల నమోదైన మాతృ మరణాలపై ఆమె విస్తృతంగా చర్చించారు. ప్రతి మాతృ మరణాన్ని అత్యంత బాధ్యతతో పరిశీలించి, దానికి దారితీసిన కారణాలను గుర్తించి వెంటనే సరిదిద్దే చర్యలు చేపట్టాలని సూచించారు. గర్భిణులకు గర్భధారణ ప్రారంభ దశ నుంచే నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, అధిక ప్రమాద గర్భిణులను ముందుగానే గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలని స్పష్టం చేశారు. ప్రసవానికి ముందు, ప్రసవ సమయంలో, ప్రసవానంతరం అవసరమైన వైద్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, అత్యవసర పరిస్థితుల్లో ఉన్నత వైద్య కేంద్రాలకు వేగంగా తరలించేలా రిఫరల్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. స్వర్ణ కుమారి మాట్లాడుతూ, మాతృ మరణాల నివారణ కోసం ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి ఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి లోపాలను సరిదిద్దుతున్నామని, గర్భిణుల క్రమం తప్పని ఆరోగ్య పరీక్షలు, రక్తహీనత నివారణ, సంస్థాగత ప్రసవాల ప్రోత్సాహం, అధిక ప్రమాద గర్భిణుల నిరంతర పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారులు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సంబంధిత ఆరోగ్య సిబ్బంది పాల్గొని ప్రతి కేసును విడివిడిగా సమీక్షించి, భవిష్యత్తులో మాతృ మరణాలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

# ఆటోనగర్ ఇటుక లారీ యూనియన్ ముఖ్య ప్రకటన





హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి ఆటోనగర్
ఈరోజు ఆటోనగర్‌లోని ఇటుక లారీ యూనియన్ ఆధ్వర్యంలో, ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న అన్ని ఇటుక లారీ యూనియన్ల ప్రతినిధులు సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.

సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాలు:
- అన్ని యూనియన్లు ఐక్యంగా ముందుకు సాగాలని నిర్ణయించాయి.
- సంబంధిత అధికారులను, ప్రజాప్రతినిధులను ఎవరెవరిని కలిసి సమస్యలను వివరించాలనే అంశంపై చర్చించారు.
- అనంతరం మధుయాష్కి గౌడ్ గారిని కలిసి ఇటుక లారీ ఓనర్ల సమస్యలను వివరించడం జరిగింది.
- ఓవర్‌లోడ్‌ను ఆగస్టు 1వ తేదీ నుండి పూర్తిగా బంద్ చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించడం జరిగింది.
- తదుపరి కార్యాచరణ సమావేశం లిలిఎక్కడ, ఎప్పుడు నిర్వహించనున్నామో వచ్చే రెండు రోజుల్లో తెలియజేయడం జరుగుతుంది.
- ప్రతి ఒక్క ఇటుక లారీ ఓనర్ ఈ నిర్ణయాన్ని గౌరవించి, ఆగస్టు 1వ తేదీ నుండి ఓవర్‌లోడ్ చేయకుండా యూనియన్‌కు సహకరించాలని మనవి.

ఐక్యతే మన బలం హక్కుల సాధనే మన లక్ష్యం. ÷

ఇట్లు,
కరీంనగర్ బ్రిక్స్ యూనియన్ అధ్యక్షులు
గుర్జ నర్సింహా గౌడ్

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in




# ఎల్బీనగర్ అభివృద్ధి పనులకు వేగం కోరిన నాయకులు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 27:-
ఎల్బీనగర్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతోను కోరారు. సోమవారం జోనల్ కార్యాలయంలో ఆయనను కలిసి నియోజకవర్గంలోని పలు అభివృద్ధి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా రహదారుల నిర్మాణం, అంతర్గత వీధుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు వంటి అంశాలను ప్రస్తావించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అత్యవసర పనులను ప్రాధాన్యతతో చేపట్టి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశానికి హాజరైన పలు కాలనీల ప్రతినిధులు కూడా తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్ల దుస్థితి, డ్రైనేజీ సమస్యలు, పారిశుధ్య లోపాలు, తాగునీటి ఇబ్బందులు తదితర అంశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్, మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రతి కాలనీకి మెరుగైన మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని పేర్కొన్నారు.
నాయకులు, కాలనీవాసులు ప్రస్తావించిన సమస్యలపై జోనల్ కమిషనర్ వికాస్ మహతో సానుకూలంగా స్పందిస్తూ, పెండింగ్‌లో ఉన్న పనులను ప్రాధాన్యత ఆధారంగా పూర్తి చేయడంతో పాటు సంబంధిత శాఖలతో సమన్వయం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



# పోలీసింగ్‌లో నాణ్యత పెంచాలని సీపీ తరుణ్ జోషి ఆదేశం

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 27:-
ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ సోమవారం నందిగామ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి స్టేషన్ పనితీరు, రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించారు. కేసుల దర్యాప్తులో జాప్యానికి తావు లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. గ్రేవ్ అన్‌డిటెక్టెడ్ కేసుల ఛేదనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించాలని, జజుచీూ, ఈ-సాక్షి వంటి డిజిటల్ వ్యవస్థల ద్వారా దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచాలని పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా విజిబుల్ పోలీసింగ్‌ను బలోపేతం చేయడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ఫిర్యాదుల పరిష్కారంలో వేగం పెంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం కాన్హా శాంతివనాన్ని సందర్శించిన కమిషనర్ అక్కడి నిర్వాహకులతో సంస్థ సేవల గురించి తెలుసుకుని చిన్నారులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ చ. శిరీష, ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణ, ఎస్‌హెచ్‌ఓ బి. వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



# ఇబ్రహీంపట్నంలో మూడు రోజులపాటు గురు పౌర్ణమి మహోత్సవాలు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 27:-
రంగారెడ్డి జిల్లా,ఇబ్రహీంపట్నం మండలం ఖానాపూర్ సమీపంలోని సత్యనారాయణ గుట్ట సాగర్‌రోడ్డు పక్కన ఉన్న శ్రీ శిరిడి సాయిబాబా ఏకశిలా విగ్రహ దేవస్థానంలో గురు పౌర్ణమి మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. జూలై 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు, అన్నదానాలు జరగనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. జూలై 28 మంగళవారం: ఉదయం 6 గంటలకు హారతితో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు సాయిబాబాకు వ్రతాలు, అర్చనలు, అభిషేకాలు, ద్వారజరోహణం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 నుంచి 12:30 వరకు హారతి, అనంతరం 3:30 వరకు అన్నదానం ఉంటుంది. సాయంత్రం 3 నుంచి 6 వరకు అర్చనలు, భజనలు, రాత్రి 9 నుంచి 9:30 వరకు నిషాములతో శేష హారతి జరుగుతుంది. జూలై 29 బుధవారం – గురు పౌర్ణమి ప్రధాన రోజు: ఉదయం 6 గంటలకు హారతి, 6:30కు నిజాభిషేకం, 7 గంటల నుంచి అర్చనలు ఉంటాయి. ఉదయం 10 గంటలకు దశమహావిద్య సాధకులు యోధా గురువు పేరుమాక్ష మల్లారెడ్డి ఆధ్వర్యంలో సద్గురు త్రిశతి హోమం జరుగుతుంది. అనంతరం సహస్ర పుష్పాభిషేకం, కనకాభిషేకం, 108 కలశాల అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం అన్నదానం అనంతరం సాయంత్రం 6:30 నుంచి సర్వదర్శనం, భజనలు ఉంటాయి.
జూలై 30 గురువారం: ఉదయం 6:30కు సంప్రోక్షణ హారతి, 7 నుంచి 12 వరకు అర్చనలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం భజనలు, రాత్రి శేష హారతితో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు. దాతలు ధన సహాయం, బియ్యం, పప్పులు, చింతపండు వంటి సరుకులు, అలంకరణ వస్తువులు విరాళంగా అందించవచ్చు. మరిన్ని వివరాలకు 9949340206, 8121412367 నెంబర్లలో సంప్రదించవచ్చు.



# మా పెద్దిని కాపాడండి అని డాక్టర్లను వేడుకున్న కెసిఆర్



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఇరిగి అశోక్
ఏం చేస్తారో చేయండి మా పెద్దిని కాపాడండి వైద్యులకు చేతులెత్తి కోరిన కేసీఆర్
దేవుడున్నాడు, డాక్టర్లున్నారు.. అన్నీ సవ్యంగానే జరుగుతాయి, ధైర్యంగా ఉండండని పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన కేసీఆర్ అత్యుత్తమ చికిత్సను అందిస్తున్నామని, పూర్తి స్థాయి సమాచారం ఇవ్వడానికి మరో 48 గంటలు పడుతుందని తెలిపిన డాక్టర్లు
దాదాపు అరగంట సేపు అక్కడే నిలుచుని డాక్టర్లతో చికిత్స అందుతున్న తీరుపై క్షుణ్ణంగా ఆరా తీసిన కేసీఆర్ ఖర్చుకు వెనకాడకుండా పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడుకోవడానికి పార్టీ శాయశక్తులా కృషి చేస్తుందని కేసీఆర్ స్పష్టం ఐసీయూలో వైద్య చికిత్స విధానాన్ని పరిశీలించిన అనంతరం, కుటుంబ సభ్యుల వద్దకు చేరుకొని వారికి భరోసాను, ధైర్యాన్ని అందించిన కేసీఆర్

# గోమాత సన్మాన ఆహ్వాన కార్యక్రమం

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
గోవులు జాతీయ ప్రాణిగా గుర్తించాలని జిల్లాల వారీగా కలెక్టర్లకు భారత ప్రధాని కి గవర్నర్ గారికి రాష్ట్రాల ముఖ్యమంత్రి గారికి వినతి పత్రం ఇవ్వడం జరుగుతుంది గోవును కాపాడుకున్నప్పుడే భారత మనుగడ భారత పౌరులకు న్యాయం జరుగుతుంది భారతీయ సంపదకు గోవుల పాత్ర కీలకంగా ఉన్నది గోవుల వల్ల దీర్ఘకాలిక వ్యాధులు రావు గోవుల మన మానవ మనుగడకు రాజ్యాలకు రాజులు వెళ్లి పేరు తెచ్చిన సంపదకు గోవులు గోసేవ ప్రధాన పాత్ర పోషించాయి మనం గోవును కాపాడుకున్నప్పుడే మన మనుగడ తగ్గుతుంది సంపూర్ణ భారత దేశంలో గోహత్యను నిషేధించడం గోహత్య పూర్తిగా ఆపేయుటం గోమాతను జాతీయ సంపదగా ఆరాధ్యమైనదిగా రాజ్యాంగ బద్ధంగా గౌరవం కల్పించడం దీని వలన దేశ గోమాతలకు గౌరవం కలుగుతుంది గో సేవ దానికి కేంద్రం చట్టబద్ధత చేయడంతో పాటు ఒక గోసేవా విభాగాన్ని ఏర్పాటు చేయడం దీనివలన భారతదేశంలోని దేశీయ గోసేవ సంరక్షణకు రూపం ఏర్పడుతుంది గోచార బోర్డు ఏర్పడడం సురక్షిత చట్టబద్ధత తద్వారా గో ఆధారిత కృషి సాధ్యమవుతుంది వేద లక్షణాలు కలిగిన గోవంశం ద్వారా లభించే పంచగవ్య ఉత్పాదనల ఆవశ్యకత వాటి మీద కలిగే వ్యాపార అవకాశాలు గోమహత్యాన్ని విద్యలో పాఠ్యాంశంగా చేర్చడం భారత దేశం అంత ఆందోళన చేస్తునము గో మాత నిర్మూలించి గోవును కాపాడుకొని గోవులు జాతీయ ప్రాణి గా గుర్తించాలని భారత ప్రధాని గారు ప్రత్యేక చొరవ చూపి గోవులు జాతీయ ప్రాణి గా గుర్తించాలని హిందూ ధర్మాన్ని కాపాడాలని కోరుకుంటున్నాం.




# కాంగ్రెస్ ఎస్సీ సెల్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలి : ఎమ్మెల్యే KR నాగరాజు గారు...



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
కాంగ్రెస్ పార్టీలో కష్టపడే వారికి పదవులు లభిస్తాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు అన్నారు.వరంగల్ ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యులు వరంగల్ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మెన్ చిలువేరు శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో సోమవారం హాసన్ పర్తిలో ఎమ్మెల్యే గారినీ మర్యాదపూర్వకంగా కలిశారు.కొత్తగా పదవులు పొందిన వారు పార్టీ బలోపేతం కోసం పని చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని అన్నారు.పదవులు పొందిన నాయకులకు ఆర్డర్ కాపీలు అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ,మండల,డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలనలో అభివృద్ధిని ప్రజలు బేరీజు వేసుకోవాలి ఎమ్మెల్యే నాయిని..

## రూ.1.12 కోట్లతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన..

## ప్రతి కాలనీకి రోడ్లు, డ్రైనేజీలు అందించడమే లక్ష్యం..

## గతంలో నిధులు వెనక్కి వెళ్లాయి.. ఇప్పుడు అభివృద్ధి పనులు ప్రజల ముందుకు వస్తున్నాయి..

హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ

తేదీ : 27/07/2026-సోమవారం,
శాయంపేట, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం.
వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 31వ డివిజన్ శాయంపేట చౌరస్తా మరియు వాసవి కాలనీలో సుమారు రూ.1.12 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా స్థానిక ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ ప్రజాపాలనలో పట్టణం ఎంతగా అభివృద్ధి చెందిందో ప్రజలు ఆలోచించాలని, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను గత పరిస్థితులతో పోల్చి బేరీజు వేసుకోవాలని సూచించారు.
గతంలో పట్టణ ప్రాంతాల్లో కూడా అనేక కాలనీలు గ్రామీణ వాతావరణాన్ని తలపించే పరిస్థితుల్లో ఉండేవని, రోడ్లు లేక, డ్రైనేజీలు లేక, ప్రాథమిక సౌకర్యాల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధిని ప్రతి గల్లీకి, ప్రతి కాలనీకి తీసుకెళ్లే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.
స్లమ్ ఏరియాలు, ఎస్సీ కాలనీలు, వెనుకబడిన ప్రాంతాలు అనే తేడా లేకుండా ప్రతి ప్రాంతంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.
కాజీపేట, సోమిడి, గొపాలపురం, శాయంపేట, దీన్‌దయాళ్ నగర్, సమ్మయ్యనగర్ తదితర ప్రాంతాల్లో ఇప్పటికే రోడ్లు, డ్రైనేజీలు మరియు ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులు విస్తృతంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలను అభివృద్ధి పథంలోకి తీసుకురావడమే తమ లక్ష్యమని అన్నారు.

ప్రజలు ఏ రాజకీయ పార్టీకి ఓటు వేసినా, ఏ సామాజిక వర్గానికి చెందిన వారైనా అభివృద్ధి విషయంలో అందరూ సమానమేనని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి కాలనీకి, ప్రతి వార్డుకు అభివృద్ధి ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు.
గతంలో స్మార్ట్ సిటీ నిధులు వచ్చినప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో వినియోగించలేకపోయిన దురదృష్టకర పరిస్థితులు ఈ నగరం చూసిందని ఎమ్మెల్యే అన్నారు. ఆ నిధులను సమర్థవంతంగా వినియోగించి ఉంటే వరంగల్ నగరం మరింత అభివృద్ధి సాధించేదని పేర్కొన్నారు. ప్రస్తుతం మాత్రం ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి రూపాయి ప్రజల అభివృద్ధికే ఖర్చు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.
వర్షాకాలం వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా నిధులను సాధించి, అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లడం సులభం కాదని, అయినప్పటికీ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు పేర్కొన్నారు.
అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, రాజకీయాలకు అతీతంగా పట్టణ పురోగతికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు, అధికారులు,అభిమానులు కాలనీవాసులు పాల్గొన్నారు.

# కుక్కను తప్పించబోయి.. ఆటో డ్రైవర్ మృతి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 27:-
రోడ్డుపై అకస్మాత్తుగా ఎదురైన కుక్కను తప్పించే ప్రయత్నంలో ఆటో నుంచి కిందపడిన ఓ ఆటో డ్రైవర్, మూడు రోజుల పాటు మృత్యువుతో పోరాడి చికిత్స పొందుతూ కన్నుమూశాడు. పోలీసుల కథనం ప్రకారం, రాగన్నగూడ గ్రామంలోని ఆర్‌జీకే బ్రహ్మన్‌పల్లి ఫేజ్-3కు చెందిన బనావత్ అమర్ సింగ్ (47) జీవనోపాధి కోసం ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ నెల 23వ తేదీ ఉదయం తన ఆటోలో తుర్కయంజాల్ నుంచి ఆర్‌జీకే బ్రహ్మన్‌పల్లి వైపు వెళ్తుండగా బ్రహ్మన్‌పల్లి క్రాస్‌రోడ్ వద్ద ఒక్కసారిగా ఓ కుక్క రోడ్డుపైకి రావడంతో దానిని తప్పించేందుకు ఆటోను పక్కకు మళ్లించాడు. ఈ క్రమంలో అదుపు తప్పి ఆటో నుంచి కిందపడడంతో తలకు తీవ్ర అంతర్గత గాయాలయ్యాయి. స్థానికులు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను రాగన్నగూడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆస్పత్రికి మార్చారు. అక్కడ చికిత్స పొందుతున్న అమర్ సింగ్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించి మృతిగా ప్రకటించారు. మృతుడి కుమారుడు బనావత్ నితిన్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటనపై ఎలాంటి అనుమానాలు లేవని పేర్కొంటూ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో మృతుడి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in



# విద్యార్థులు నాలుగేళ్ల విద్యా కాలాన్ని సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలి : శ్రీ ఎనగందుల వరదా రెడ్డి

హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ

వరంగల్: ఎస్ఆర్ యూనివర్సిటీ, వరంగల్‌లో నూతనంగా చేరిన మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు స్వాగతం పలుకుతూ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. విద్యార్థుల ఉన్నత విద్యా ప్రయాణానికి శ్రీకారం చుట్టిన ఈ కార్యక్రమంలో 5,000 మందికి పైగా విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.ఎస్ఆర్ యూనివర్సిటీ ఛాన్సలర్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ శ్రీ ఎనగందుల వరదా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.వి. రమణారావు, ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి. మహేష్, డీన్‌ఆపరేషన్స్ అండ్ గ్రోత్ ప్రొఫెసర్ ఆర్. అర్చనా రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.యూనివర్సిటీ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తరిస్తున్న ప్రస్థానానికి ప్రతీకగా, ఈ నూతన విద్యార్థుల బృందంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలతో పాటు దేశంలోని 20కి పైగా రాష్ట్రాలు, పలు విదేశాలకు చెందిన విద్యార్థులు ఉన్నారు.విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి ఛాన్సలర్ శ్రీ ఎనగందుల వరదా రెడ్డి మాట్లాడుతూ, యూనివర్సిటీలో గడిపే నాలుగేళ్లు విద్యార్థుల భవిష్యత్తు, కెరీర్, జీవితాన్ని తీర్చిదిద్దడంలో అత్యంత కీలకమైనవని అన్నారు. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, క్రమశిక్షణ, సమయపాలన, క్రమబద్ధత పాటిస్తూ విద్యా, సహపాఠ్య కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. వేగంగా మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవడంతో పాటు, వృత్తి రంగంలో మారుతున్న అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

విద్యతో విద్యార్థుల్లో నేర్చుకోవడం, నిర్ణయాలు తీసుకోవడం, వ్యక్తిగత అభివృద్ధి వంటి అంశాల్లో మరింత బాధ్యత పెరుగుతుందని ఆయన అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవిస్తూ, సరైన నిర్ణయాలు తీసుకుని తమ లక్ష్యాలపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో నాణ్యమైన సమయాన్ని గడుపుతూ, వారితో స్వేచ్ఛగా మాట్లాడి, స్నేహపూర్వకమైన, సహాయకరమైన సంబంధాన్ని కొనసాగించాలని కోరారు. విద్యార్థుల సంక్షేమానికి యూనివర్సిటీ కట్టుబడి ఉందని పేర్కొంటూ, తమ నాలుగేళ్ల విద్యా కాలాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ, యూనివర్సిటీలో లభించే స్వేచ్ఛ, అవకాశాలు, వనరులను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు తమకంటూ ప్రత్యేకమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఆసక్తి, ప్రశ్నించే తత్వంతో కూడిన అభ్యాసానికి ప్రాధాన్యత ఇవ్వాలని, తమ సౌకర్య పరిధి నుంచి బయటకు వచ్చి కొత్త అవకాశాలను అన్వేషించాలని అన్నారు. సహకారం, తోటి విద్యార్థుల నుంచి నేర్చుకోవడం, మంచి సంబంధాలను ఏర్పరచుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. తరగతి గదిలో చురుకుగా పాల్గొని, అధ్యాపకులను సందేహాలు నివృత్తి చేసుకుంటూ, చర్చల్లో పాల్గొంటూ నేర్చుకోవాలని సూచించారు. యూనివర్సిటీలోని పరిశోధనా వాతావరణం, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అధునాతన ప్రయోగశాలలు, ఇతర విద్యా వనరులను విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు.ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి. మహేష్ ఎస్ఆర్ యూనివర్సిటీ సాధించిన విద్యా విజయాలు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రూపొందించిన విద్యా వ్యవస్థను వివరించారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో భారతదేశంలోని టాప్100 ఇంజినీరింగ్ సంస్థల్లో యూనివర్సిటీ నిరంతరం స్థానం పొందుతోందని, ఎన్ఐఆర్ఎఫ్ 2025లో ఇంజినీరింగ్ విభాగంలో 91వ ర్యాంక్ సాధించిందని తెలిపారు. అలాగే THE World University Rankings 2026లో ప్రపంచవ్యాప్తంగా 8011000 బ్యాండ్‌లో, భారతదేశంలో 28వ స్థానంలో, UI GreenMetric World University Rankings 2025లో ప్రపంచవ్యాప్తంగా 585వ స్థానంలో నిలిచినట్లు వివరించారు.అదేవిధంగా బి.ఎస్‌సి. (ఆనర్స్) అగ్రికల్చర్ ప్రోగ్రామ్, స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు లభించిన ICAR గుర్తింపు, అలాగే 170కి పైగా స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేసిన ా=అశ విజయాలను ఆయన వివరించారు. విద్యార్థులు తమ బలహీనతలను అధిగమించి, టీమ్‌వర్క్, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, ఇంటర్న్‌షిప్‌లు, సర్టిఫికేషన్ కోర్సులను సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని, తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను వాస్తవ ప్రపంచ అనువర్తనాలతో అనుసంధానం చేసుకోవాలని కోరారు.రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.వి. రమణారావు మాట్లాడుతూ, నాణ్యమైన విద్య, విద్యార్థుల సంక్షేమం, భద్రత, సమగ్ర అభివృద్ధికి యూనివర్సిటీ కట్టుబడి ఉందని తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యా వాతావరణం, వసతి సౌకర్యాలు, క్రీడలు, వెల్‌నెస్ సదుపాయాలు, మెంటరింగ్, కౌన్సెలింగ్ వ్యవస్థలను వివరించారు. ర్యాగింగ్, క్రమశిక్షణా రాహిత్యంపై యూనివర్సిటీ జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తుందని స్పష్టం చేస్తూ, విద్యార్థులకు సురక్షితమైన, సహాయకరమైన క్యాంపస్ వాతావరణం అందిస్తామని తెలిపారు.డీన్‌ఆపరేషన్స్ అండ్ గ్రోత్ ప్రొఫెసర్ ఆర్. అర్చనా రెడ్డి మాట్లాడుతూ, కెరీర్, ఉన్నత విద్య, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వైపు విద్యార్థులను ప్రోత్సహించేందుకు యూనివర్సిటీ అందిస్తున్న సమగ్ర సహాయక వ్యవస్థలను వివరించారు. 2026లో పట్టభద్రులైన విద్యార్థుల బ్యాచ్ 1,500కి పైగా ఇంటర్న్‌షిప్‌లు, 1,530 ప్లేస్‌మెంట్ ఆఫర్లు సాధించిందని, ఇందులో అమెజాన్ నుంచి అత్యధికంగా ₹44 లక్షల వార్షిక వేతన ప్యాకేజీ లభించిందని తెలిపారు. అగ్రికల్చర్ విభాగంలో 100 శాతం ప్లేస్‌మెంట్స్ సాధించినట్లు పేర్కొన్నారు.స్కిల్ డెవలప్‌మెంట్, ఆప్టిట్యూడ్, కమ్యూనికేషన్ ట్రైనింగ్, అసెస్‌మెంట్స్, సర్టిఫికేషన్లు, కంపెనీ ఆధారిత శిక్షణ, మాక్



ఇంటర్వ్యూల ద్వారా విద్యార్థులకు సమగ్ర ప్లేస్‌మెంట్ శిక్షణ అందిస్తున్నట్లు ఆమె వివరించారు. 2027లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేయనున్న విద్యార్థులు ఇప్పటికే ServiceNow, Agoda వంటి సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌లు సాధించారని, వారికి గరిష్ఠంగా ₹89,000 వరకు స్టైపెండ్ లభిస్తోందని తెలిపారు.కార్యక్రమం ముగింపులో డీన్‌అకడమిక్స్ ప్రొఫెసర్ ఎ. శ్రీనివాస్ ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న ఇండక్షన్ ప్రోగ్రామ్ షెడ్యూల్‌ను వివరించారు.

ఓరియంటేషన్ కార్యక్రమంలో ఎస్ఆర్ యూనివర్సిటీని ఎంచుకోవడంపై తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను పంచుకోగా, నూతన విద్యార్థులు తమ విద్యా ప్రయాణాన్ని ప్రారంభించేందుకు ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన గైడెడ్ క్యాంపస్ టూర్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు యూనివర్సిటీలోని అధునాతన మౌలిక సదుపాయాలు, విద్యా సౌకర్యాలు, అభ్యాస వాతావరణాన్ని సందర్శించారు.

విద్యార్థులు, యూనివర్సిటీ, తల్లిదండ్రుల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తూ కార్యక్రమం సానుకూల, స్ఫూర్తిదాయక వాతావరణంలో ముగిసింది. విద్య, ఆవిష్కరణలు, వ్యక్తిగత అభివృద్ధి, వృత్తిపరమైన ప్రగతి, బాధ్యతాయుతమైన పౌరసత్వం లక్ష్యాలుగా విద్యార్థుల భవిష్యత్తు విద్యా ప్రయాణానికి ఈ కార్యక్రమం చక్కటి నాంది పలికింది.

## హాస్టల్లో దొంగతనాలు జరిగితే యాజమానులపైన ఎఫ్ఐఆర్ కుకట్పల్లి డిసిపి రీతిరాజ్




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఇరిగీ అశోక్

హాస్టల్సలో విద్యార్థుల వస్తువుల పోతే ఇకపై బాధ్యత పూర్తిగా యజమానులదేనని కూకట్ పల్లి జోన్ డీసీపీ రీతిరాజ్ హెచ్చరించారు. ఇదివల్ల కాలంలో హాస్టల్లో దొంగతనాలు విపరీతంగా పెరిగిపోయాయి. బంగారు గొలుసులు మొబైల్ ఫోన్లు ఎక్కువగా చోరికి గురవుతున్నాయన్నారు. చాలా హాస్టల్స్ కనీస భద్రత పరిణామాలు కూడా పాటించడం లేదు హాస్టల్స్ లోకి ఎవరు వస్తున్నారు ?ఎవరు పోతున్నారు.? అనే కనీస సమాచారం కూడా రికార్డు చేయడం లేదన్నారు. తాము నిర్వహించిన డేకాయ్ ఆపరేషన్లలో చాలా లొసుగులు బయటపడ్డాయని పబ్లిక్ నుంచి కూడా పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ఇకపై హాస్టల్లో దొంగతనాలు జరిగితే.. కేవలం దొంగలపైనే కాకుండా యజమానుల మీద కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని స్పష్టం చేశారు.. ప్రతి హాస్టల్ యాజమాన్యం విధిగా సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేసుకోవాల్సిందేనని సూచించారు. సేఫ్టీ ప్రమాణాలు పాటించకపోతే ఉపేక్షించేది లేదన్నారు. హాస్టల్ నిర్వాహణలో ఏమైనా సమస్యలు ఉంటే తమతో పంచుకోవాలని భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డిసిపి హెచ్చరించారు..



(హైదరాబాద్ ఎస్టేట్ జూలై 27 ఉమ్మడి వరంగల్ జిల్లా) సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ లో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రివర్యులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారు పరామర్శించడం జరిగిందిలినర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య బులిటెన్ వివరాలులి

అవయవాల పనితీరు:

ఉదయం 8:00 గంటల నుండి రాత్రి 9:00 గంటల వరకు ఉన్న సమాచారం ప్రకారం., పేషంట్ పెద్ది సుదర్శన్ రెడ్డి యొక్క గుండె మరియు మూత్రపిండాల (కిడ్నీ) పనితీరు మెరుగ్గా ఉంది. బిపి (ధ్రీ) కూడా బిపి సపోర్ట్ మెడిసిన్ తో నార్మల్‌గా మెయింటెన్ అవుతోంది.

బిపి మరియు మూత్రవిసర్జన (యూరిన్ అవుట్‌పుట్) సరిగ్గా ఉన్నందున భయపడాల్సిన అవసరం లేదని డాక్టర్స్ తెలిపారు.ఉపిరితిత్తులలో సమస్య: లంగ్స్‌లో ఇన్ఫెక్షన్ ఉండటంతో పాటు రక్తం గడ్డకట్టింది (థ్రాంబోసిస్). రోహిణి హాస్పిటల్‌లోనే ఆ రక్తపు గడ్డను దాదాపు క్లియర్ చేయడం జరిగింది. ఇంకా ఏమైనా గడ్డలు మిగిలి ఉంటే యశోద హాస్పిటల్ వైద్యులు తొలగిస్తారు.

సిపిఆర్ (జూ=) & వెంటిలేటర్: కార్డియాక్ అరెస్ట్ కావడం వల్ల తొమ్మిది సార్లు సిపిఆర్ చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత వెంటిలేటర్‌పై ఉంచి హైదరాబాద్‌కి షిఫ్ట్ చేశారు.బ్రెయిన్ ఫంక్షనింగ్ (మెదడు పనితీరు): సిపిఆర్ తొమ్మిది సార్లు చేసినప్పుడు మెదడుకు రక్తప్రసరణ కొంత తగ్గే అవకాశం ఉంటుంది. మెదడు పనితీరు పూర్తిగా ఎలా ఉందో సరిగ్గా అసెస్ చేయడానికి 24 నుండి 48 గంటల సమయం పడుతుంది. అయితే ప్రస్తుతం కంటి కదలికలు, చేతి కదలికలు (జువవ & ఝఅస వీశీజవవవత్ం) ఉన్నందున మెదడు చురుకుగానే ఉందని, డాక్టర్ తన అనుభవం ప్రకారం రోగి క్షేమంగా బయటపడతారని ధైర్యం చెప్పారు.

అపోహలు / ఫేక్ న్యూస్:

పేపర్లు మరియు సోషల్ మీడియాలో ఎక్మో (ECMO) గురించి వస్తున్న వార్తలన్నీ నిజం కావు. వాటిని నమ్మవద్దని డాక్టర్ స్పష్టం చేశారు.

అప్‌డేట్స్: ప్రస్తుతం. వైద్యుల నుంచి ప్రతి గంటకు హెల్త్ అప్‌డేట్స్ లభిస్తాయి..

## బీఎస్ఐటీ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ వ్యవస్థాపకులకు ‘టెక్నాలజీ ఎంట్రప్రెన్యూర్స్ ఆఫ్ ది ఇయర్ 2026‘ అవార్డు

హైదరాబాద్, జూలై 27: హైదరాబాద్‌లోని టీ–వర్క్స్ వేదికగా నిర్వహించిన తెలంగాణ అండ్ హైదరాబాద్ ఎలైట్ బ్రాండ్ అవార్డ్స్ 2026 కార్యక్రమంలో బీఎస్ఐటీ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ సంస్థ వ్యవస్థాపకులు, సీఈఓలు భాను చందర్ గరిగెల, శారదా నేనావత్లకు ‘టెక్నాలజీ ఎంట్రప్రెన్యూర్స్ ఆఫ్ ది ఇయర్ 2026‘ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమాన్ని గ్లోబల్ పిన్నాకిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, వోయ్సియస్ సాంకేతిక భాగస్వామ్యంతో నిర్వహించారు.




సాంకేతిక రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సైబర్ భద్రత, క్లౌడ్ సేవలు, వెబ్ మరియు మొబైల్ అప్లికేషన్ అభివృద్ధి, ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, డిజిటల్ ఇంజినీరింగ్, డేటా అనలిటిక్స్ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచి, దేశీయ, అంతర్జాతీయ సంస్థలకు అత్యాధునిక సాంకేతిక పరిష్కారాలను విజయవంతంగా అందిస్తున్నందుకు భాను చందర్ గరిగెల, శారదా నేనావత్ ఈ అవార్డుకు ఎంపికయ్యారు.

ఈ అవార్డును ఒలింపిక్ పతక విజేత, పద్మభూషణ్ పురస్కార గ్రహీత సైనా నెహ్వాల్, కేంద్ర ఆర్థిక సేవల శాఖ సంయుక్త కార్యదర్శి ఆదిత్య ప్రవీణ్ చేతుల మీదుగా భాను చందర్ గరిగెల, శారదా నేనావత్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా భాను చందర్ గరిగెల, శారదా నేనావత్ మాట్లాడుతూ, ఈ గుర్తింపు సంస్థ బృందం సమష్టి కృషికి, ఖాతాదారుల విశ్వాసానికి దక్కిన గౌరవమని తెలిపారు. భవిష్యత్తులో మరింత వినూత్న సాంకేతిక పరిష్కారాలతో ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా సేవలను విస్తరించి, సంస్థను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

## సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ఉద్యమం ఉధృతం

### 641 జీవో వెంటనే రద్దు చేయాలి:మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

### డంపింగ్ యార్డ్ రద్దు చేయకపోతే అమరణ నిరాహార దీక్ష:ఎమ్మె సత్యనారాయణ

### ఉమ్మడి కార్యాచరణతో డంపింగ్ యార్డ్‌ను అడ్డుకుంటాం:జేఏసీ

హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జులై 27

సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం.641ను వెంటనే రద్దు చేయాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు.

సోమవారం సిద్ధాపూర్ గ్రామంలో నిర్వహించిన సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో పచ్చని పంట పొలాలు,భూగర్భ జలాలు తీవ్రంగా దెబ్బతింటాయని,ప్రజల భవిష్యత్తు అంధకారంలో పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన ప్రభుత్వం,డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేయడం సరికాదన్నారు.




డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ మాట్లాడుతూ,జీవో 641ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయకపోతే ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమవుతానని హెచ్చరించారు.డంపింగ్ యార్డ్ వల్ల భూగర్భ జలాలు కలుషితమై,గొలుసుకట్టు చెరువుల ద్వారా ఉస్మాన్ సాగర్ వరకు ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.జేఏసీ చైర్మన్ రాంబాల్ నాయక్ మాట్లాడుతూ,డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా గ్రామాలు,తండాలు,ప్రజా సంఘాలు ఉమ్మడిగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తూ ప్రభుత్వం జీవోను వెనక్కి తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జేఏసీ కన్వీనర్ పినపాక ప్రభాకర్,సలహాదారులు వంగూరి గంగిరెడ్డి, అబ్దుల్ రబ్ జామి, రాజవరప్రసాద్, కో–చైర్మన్ దొడ్డి శ్రీనివాస్, బొజ్జా శ్రీనివాస్ రెడ్డి, వడ్డె బాలయ్య, రజిత నాయక్, బుద్దల జంగయ్య, ఈశ్వర్ నాయక్, రవీంద్రనాథ్, టి.జి. శ్రీనివాస్, అర్జున్, శ్రీకాంత్, ఆకాశ్ నాయక్, పెంటనోళ్ల నర్సింహ, బచ్యా నాయక్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# నిరంతరం కార్మికుల హక్కుల కోసం పోరాడతూనే ఉంటాం. ఏఐటీయూసీ

హైదరాబాద్ ఎస్టేట్ 27 జులై 2026

ఏఐటీయూసీ సంఘం 100 సంవత్సరాలుగా అనేక కార్మికుల హక్కులను సాధించడం ద్వారా కార్మిక వర్గంలో ఎంతో కృషి చేస్తూ కిందిస్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు కూడా నాయకత్వం ఉంది. కాబట్టి ఈనాటి వరకు నియంతృత్వ బిజెపి ప్రభుత్వం ఉన్న రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా మరి నిరంతరం కార్మికుల హక్కుల కోసం కృషి చేస్తూ ఆ కార్మికుల హక్కులను కాపాడుకోవడం ద్వారా మరి అదే విధంగా ఏదైతే బ్రిటిష్ కాలం నాటి నుంచి సాధించుకున్న 44 చట్టాలను ఈ కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుంటే మరి వాటికి వ్యతిరేకంగా బొగ్గు గని కార్మికులు దేశవ్యాప్త ఉన్న బ్యాంకింగ్ రంగం నుంచి అన్ని రంగాల వరకు సమ్మె చేసి మరి వాటిని కాపాడుకోవడానికి కృషి చేయడం జరుగుతుంది. అయినా గాని నియంతృత్వంగా మరి ప్రభుత్వంలో ఉన్న పరిశ్రమలన్నీ దాకట్టు పెట్టి అమ్మి వేసి వాళ్ళ మిత్రులకు అమ్మివేసి మరి ఈ దేశాన్ని దివాలాతీసే విధంగా కార్మికులను కట్టు బానిసలు చేస్తూ నిరుద్యోగ సమస్య పెంచడం ద్వారా అదే రకంగా కార్మిక వర్గానికి ఎలాంటి హక్కులు లేకుండా కట్టు బానిసలుగా చేస్తుంది. కాబట్టి ఏఐటీయూసీ అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని సమ్మెలు చేయడం జరిగింది. అయినా గాని ఆ నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయకుండా జాప్యం చేస్తూ ఈ ప్రభుత్వం




అన్యాయం చేసింది. కాబట్టి మరి అదే కోవాలో పోరాటాల వల్ల కొంత సాధ్యమైనంత వాటిని ఆపుకోగలిగిన పూర్తిస్థాయిలో ఆపుకోలేకపోతున్నాం కాబట్టి మరి ఏఐటీయూసీ మహా సందర్భంగా నిర్ణయాలు చేసి మరి కార్మిక వర్గాన్ని పోరాటానికి సమర్థం చేయడం జరుగుతుంది. కాబట్టి నాలుగు లేబర్ కోడ్స్ ను తిప్పి కొట్టే విధంగా కనీస హక్కులు కార్మిక చట్టాలు పరిశ్రమలను కూడా కాపాడుకునే విధంగా మన హక్కులు పోరాటాలు ఉంటాయి. భవిష్యత్తు పోరాటం మార్గంగా మన మంచిర్యాల జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి. ఈ ప్రాంతమంతా సింగరేణి కార్మికులు మరియు కాంట్రాక్ కార్మికులు సంఘటిత అసంఘటిత కార్మికులు అందరూ మహాసభలలో పాల్గొనడం ద్వారా విజయవంతం చేయాలి, మరి కేంద్ర ప్రభుత్వం ఏవైతే హక్కులని ఇవ్వకుండా ఇప్పటివరకు పెండింగ్లో పెడుతున్నారో వాటికోసం పోరాడుతాం పట్టణ కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అక్బర్ ఆలీ సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఇప్పకాయల లింగయ్య జిల్లా ఉపాధ్యక్షులు మిట్టపల్లి పౌల్ మరియు సాంబయ్యా మొండి జెట్టి మల్లయ్యా వివిధ గనుల పిట్ సెక్రటరీలు హరి రామకృష్ణ ముకుంద రెడ్డి కమిటీ సభ్యులు కాంట్రాక్ట్ కార్మికులు సంఘటిత అసంఘటిత కార్మికులు తదితరులు పాల్గొన్నారు .

# డా. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనకు దీపక్ భౌ నికాల్జే నాయకత్వం స్ఫూర్తిదాయకం డా. పిట్టా వరప్రసాద్




హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి హైదరాబాదు జూలై 27, 2026:

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) జాతీయ అధ్యక్షులు శ్రీ దీపక్ భౌ నికాల్జే జన్మదిన వేడుకలు ముంబైలోని చెంబూర్‌లో సోమవారం అర్ధరాత్రి ఘనంగా నిర్వహించబడ్డాయి. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్లాల్ పార్టీ ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ కార్యదర్శి డా. పిట్టా వరప్రసాద్ మాట్లాడుతూ, జాతీయ అధ్యక్షులు దీపక్ భౌ నికాల్జే నాయకత్వంలో పార్టీ దేశవ్యాప్తంగా డా. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల సాధనకు నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేస్తున్న పోరాటం ప్రతి కార్యకర్తకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. దీపక్ భౌ నికాల్జే దీర్ఘాయుష్షుతో, సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవను మరింత విస్తరించాలని ఆకాంక్షిస్తూ ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టే బాబీ, మహారాష్ట్ర రాష్ట్ర అధ్యక్షులు శ్రీ బాలాసాహెబ్ పవార్, అశోక్ ససానే, తానాజీ మిస్లే, సచిన్ కోకణే, రాజేష్ కటారనవారే, సురేష్ జాధవ్, ఆకాశ్ ఘోడ్కే, అమోల్ జావలే, దిలీప్ కదమ్, అశోక్ జగతాప్, నితిన్ జాధవ్, వసీం షేక్, పంచమ్ గౌడ్, విజయ్ సురడ్కర్, బాలా పాటిల్, పంకజ్ లోఖండే, పంకజ్ కాంబ్లే, కృష్ణా వాఘుల్కర్, దేవేంద్ర ఖడ్సే, గణేష్ సాబ్లే, నరేష్ గాయకవాడ్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని బీజేవైఎం డిమాండ్
## 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం:బీజేవైఎం

హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జులై 27

తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం రాష్ట్ర పిలుపు మేరకు షాద్‌నగర్‌లో ఫీజుల బకాయిబీజేపీ లడాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేవైఎం షాద్‌నగర్ అసెంబ్లీ కన్వీనర్ పుట్నాల సాయికుమార్ ఆధ్వర్యంలో బీఏఎం డిగ్రీ కళాశాల,విశ్వభారతి ఇంటర్ కళాశాలల్లో సుమారు 300 మంది విద్యార్థులతో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రంగారెడ్డి జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు బుర్ర అభినయ్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో లక్షలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం కేవలం రూ.100 కోట్లు విడుదల చేస్తామని ప్రకటించడం సమస్యకు పరిష్కారం కాదని విమర్శించారు. ఫీజుల బకాయిల కారణంగా పేద,మధ్యతరగతి,ఎస్సీ, ఎస్టీ,బీసీ,ఈబీసీ,మైనారిటీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు



ఎదుర్కొంటున్నారని,కొన్ని కళాశాలలు సర్టిఫికెట్లు నిలిపివేయడం,పరీక్షలకు అనుమతించకపోవడం వంటి పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే పూర్తిస్థాయిలో విడుదల చేయాలని,విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని,ప్రతి విద్యా సంవత్సరంలో నిర్దిష్ట కాలపట్టిక ప్రకారం నిధులు విడుదల చేసే శాశ్వత విధానాన్ని అమలు చేయాలని బీజేవైఎం డిమాండ్ చేసింది. ప్రభుత్వం స్పందించి విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బీజేవైఎం నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు వివేక్,శివలింగం,అభి,శ్రీధర్,నరేష్,మహేష్,రాకేష్,రమేష్,పవన్,అజయ్,చందు తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య బులిటెన్ వివరాలు



(హైదరాబాద్ ఎస్టేట్ జూలై 27 ఉమ్మడి వరంగల్ జిల్లా

అవయవాల పనితీరు:

ఉదయం 8:00 గంటల నుండి రాత్రి 9:00 గంటల వరకు ఉన్న సమాచారం ప్రకారం., పేషంట్ పెద్ది సుదర్శన్ రెడ్డి యొక్క గుండె మరియు మూత్రపిండాల (కిడ్నీ) పనితీరు మెరుగ్గా ఉంది. బిపి (ధ్రూ) కూడా బిపి సపోర్ట్ మెడిసిన్ తో నార్మల్‌గా మెయింటెన్ అవుతోంది.

బిపి మరియు మూత్రవిసర్జన (యూరిన్ అవుట్‌పుట్) సరిగ్గా ఉన్నందున భయపడాల్సిన అవసరం లేదని డాక్టర్స్ తెలిపారు. ఉపిరితిత్తులలో సమస్య: లంగ్స్‌లో ఇన్ఫెక్షన్ ఉండటంతో పాటు రక్తం గడ్డకట్టింది (థ్రాంబోసిస్). రోహిణి హాస్పిటల్‌లోనే ఆ రక్తపు గడ్డను దాదాపు క్లియర్ చేయడం జరిగింది. ఇంకా ఏమైనా గడ్డలు మిగిలి ఉంటే యశోద హాస్పిటల్ వైద్యులు తొలగిస్తారు.

సిపిఆర్ (జూ=) & వెంటిలేటర్: కార్డియాక్ అరెస్ట్ కావడం వల్ల తొమ్మిది సార్లు సిపిఆర్ చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత వెంటిలేటర్‌పై ఉంచి హైదరాబాద్‌కి షిఫ్ట్ చేశారు.

బ్రెయిన్ ఫంక్షనింగ్ (మెదడు పనితీరు): సిపిఆర్ తొమ్మిది సార్లు చేసినప్పుడు మెదడుకు రక్తప్రసరణ కొంత తగ్గే అవకాశం ఉంటుంది. మెదడు పనితీరు పూర్తిగా ఎలా ఉందో సరిగ్గా అసెస్ చేయడానికి 24 నుండి 48 గంటల సమయం పడుతుంది. అయితే ప్రస్తుతం కంటి కదలికలు, చేతి కదలికలు (Eye Ê Hand Movements) ఉన్నందున మెదడు చురుకుగానే ఉందని, డాక్టర్ తన అనుభవం ప్రకారం రోగి క్షేమంగా బయటపడతారని ధైర్యం చెప్పారు.

అపోహలు / ఫేక్ న్యూస్:

పేపర్లు మరియు సోషల్ మీడియాలో ఎక్మో (ECMO) గురించి వస్తున్న వార్తలన్నీ నిజం కావు. వాటిని నమ్మవద్దని డాక్టర్ స్పష్టం చేశారు.

అప్‌డేట్స్: ప్రస్తుతం. వైద్యుల నుంచి ప్రతి గంటకు హెల్త్ అప్‌డేట్స్ లభిస్తాయి..

# భారీ వర్షానికి పార్కింగ్ స్థలం జలమయం.. నీట మునిగిన 50కు పైగా కార్లు

భారీ వర్షాలకు పార్కింగ్ ఏరియా జలమయమైంది. ఈ నేపథ్యంలో అక్కడ పార్క్ చేసిన సుమారు 50కుపైగా కార్లు సగం వరకు నీట మునిగాయి. (ఝతీం రాబఎఎవతీస్త్రవస) ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. గుజరాత్‌లోని వల్సాద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఈ జిల్లా తీవ్రంగా ప్రభావితమైంది. పార్కింగ్ పరిష్కారాలుకాగా, గురువారం ఉదయం వరకు 16 గంటల్లో వల్సాద్‌లోని ఉంబర్‌గావ్ ప్రాంతంలో 1,100 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వేలాది మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మరోవైపు వల్సాద్‌లోని వాపిలో వాహనాల పార్కింగ్ స్థలం జలమయమైంది. ఈ నేపథ్యంలో అక్కడ పార్క్ చేసిన సుమారు 50కు పైగా కార్లు నీటిలో చిక్కుకున్నాయి. కార్ల విండో వరకు వర్షం నీరు చేరడంతో పాక్షికంగా మునిగిపోయాయి. ఈ షాకింగ్ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

